# అమ్మ

తల్లి ప్రేమ లాంటి వెన్నెల్లో డాబా మీద బొంత పరుచుకుని మహా లక్ష్మమ్మ ఒకింత నడుం వాల్చిందో లేదో "బామ్మా బామ్మా" అంటూ పరుగెత్తుకొచ్చారు మనవళ్ళు రాజు, సుభాష్ మనవరాలు అరతీనూ.

"ఏమర్రా అప్పుడే చదువులై పోయాయా ?"

"ఓ" అని రాజు తలూపితే, "హోం వర్కు కూడా - చేసేసుకున్నాంగా" అంది అరతి.

"చదువుకోకుండా నీతో కబుర్లు చెబితే మా మమ్మీ వూరుకుంటుందేమిటి" అన్నాడు సుభాష్.

"నువ్వు నిజంగా గడుగ్గాయి వేరా" అందావిడ సుభాష్ని బుగ్గగిల్లి.

ముద్దొస్తోన్న పదేళ్ళలోపు కొడుకు బిడ్డల్ని అభిమానంగానూ అపురూపంగానూ చూస్తూ మురిసిపోయిందావిడ.

"ఒక మంచి కథ చెప్పు బామ్మా" గారాలు పోతూ అంది అరతి బామ్మ ప్రక్కనే కూర్చుంటూ.

"రాకుమారుడి కథ చెప్పు బామ్మా" అని రాజు అన్నాడో లేదో "తన పేరు రాజని పెద్ద గొప్ప !" అంటూ మూతి తిప్పింది అరతి.

"నీకే గొప్ప"

"నీకే గొప్ప"

"అపున్నాకే గొప్ప. నా పేరు కింగ్. నీ పేరు అరఠంట అరతి. ఏం బావుంది ?!"

"చూడు బామ్మా" ఏడుపు మొఖం పెట్టింది.

"ఊరు కోండర్రా. మీలో మీరలా పోట్లాడుకోవచ్చా తప్పు కదూ? ప్రేమగా కసిరింది మహా లక్ష్మమ్మ.

"రాజుల కథలూ వద్దు రాక్షసుల కథలూ వద్దుగాని ఓ పాట పాడు బామ్మా" సుభాష్ అన్నాడు గోముగా.

"నా పాటలు మీకు నచ్చుతాయేవిట్రా. మా కాలం వేరు మా పాటలు వేరు" అంది నవ్వుతూ.

"నచ్చుతాయి బామ్మా పాడు పాడు" ముక్తకంఠంతో కోరారంతా.

"జో అచ్యుతానంద జోజో ముకుందా లాలి పరమానంద రామ గోవిందా జోజో...." అంటూ తీయగా పాడింది.

"చాలా బాగా పాడావు బామ్మా" మెచ్చుకున్నాడు సుభాష్.

"ముసిల్దాని పాటేం బావుంటుందిరా. ఇదీ వరకు మీ నాన్న చిన్నప్పుడు అంటే ఉయ్యాల తొట్టెలో వేసినప్పుడు ఈ పాట పాడితే అంతా ఎంతో బావుందని మెచ్చుకుని మళ్ళీ మళ్ళీ పాడించుకున్నారనుకో. ఆ రోజుల్లో ఏ ఇంట్లో పెళ్ళైనా పేరంటమైనా నేను పాడితే గాని పూరుకునే వాళ్ళు కాదర్రా" ఆ రోజుల్ని గుర్తు చేసుకుంటూ వుత్సాహంగా అంది.

"అయితే బామ్మా- నువ్వు రోజూ మా డాడీని జోల పాట పాడి నిద్ర పుచ్చేదానివన్న మాట. మా మమ్మీ కసలు పాటలే రావు!"

అరతి మాటలకి సరదాగా నవ్వేసిందావిడ.

"మరేమో బామ్మా. చిన్నప్పుడు మా డాడీ మాలాగా బుద్ధిగా చదువుకునే వాడా-అల్లరి చేసేవాడా ?" కుతూహలంగా అడిగాడు రాజా.

"అప్పుడేవిటి ఇప్పుడేవిటి వజ్రపు తునకేరా మీ నాన్న. ఇవ్వాడు మీరు రిక్షాల మీద కార్ల మీద బడికెళుతున్నారు గానీ ఆ రోజుల్లో ఇవన్నీ వుండేవేమిటీ. వానలో వరదలో నాలుగు మైళ్ళు నడిచి వీర వాసరం వెళ్ళి చదువుకునే వాడు బిడ్డ. చదువులోనూ సంధ్యలోనూ ఎంత చురుగ్గా వుండే వాడనీ వద్దన్నా వినకుండా నాకు వంటలో సాయం వచ్చేవాడు మీ తాతకి పొలం అన్నం మూట పట్టుకెళ్ళేవాడు. మళ్ళీ చీకటి పడేసరికి కోడి గుడ్డు దీపం పెట్టుకుని గణగణా చదువుకునేవాడు. ఆ రోజుల్లో వూళ్ళో వాళ్ళే మనేవారో తెలుసా ? ఆ మహా లక్ష్మమ్మ కొడుకుని చూసైనా బుద్ధి తెచ్చు కోండ్రా అని పిల్లల్ని మందలించే వాళ్ళు. అలా కష్టపడి చదువుకున్నాడు గనుకే ఇవాళంత గొప్ప ఆఫీసరయ్యాడు. అన్నట్టు మరిచేపోయానర్రా. అప్పట్లో ఒకేడు ఆటల్లోనూ అదేదో రాత పోటీల్లోనూ మీ నాన్నకి బహుమతు లొచ్చాయిరా. సబ్బిళ్ళ పెట్టీ పెన్సిలూ చిన్న బొమ్మా ఇచ్చారు" గొప్పగా చెప్పింది.

బామ్మ మాటలకి కిలకిలా నవ్వేశారు పిల్లలు.

"నవ్వుతారేమర్రా నిజంగానే ఇచ్చారు. మీ నాన్న మీదొట్టు"

"అవేం ప్రైజులు గ్రానీ. సబ్బు పెట్టీ...." ఆ పైన చెప్పలేక పోయింది అరతి నవ్వు వురికి రావటం వల్ల

"చాలా గొప్ప ప్రైజు లొచ్చాయి బామ్మా" రాజు అన్నాడు.

ఆవిడ ముఖం కందగడ్డ అయ్యింది "ఆ రోజుల్లో అవే గొప్ప మరి....!"

బామ్మ నొచ్చుకుందని గ్రహించిన సుభాష్ మాట మారుస్తూ అన్నాడు" అద్సరే గాని బామ్మా- చిన్నప్పుడు మా డాడీని కొట్టేదానివా?"

"సరదాకి కొడదామన్నా చిన్న తప్పు కూడా చేసేవాడు కాదర్రా మీ నాన్న. వాడ్ని చూసి మీ తాతెంత మురిసిపోయే వారో!"

"అసలెప్పుడూ ఒక్కసారీ కొట్టలేదా బామ్మా ?" నొక్కించి అడిగాడు రాజు.

"ఒకసారి కొట్టేనర్రా- పాపిష్ఠిదాన్ని !"

"ఎందుకు కొట్టేవు గ్రానీ ?"

"అవాళేం జరిగిందంటే.... ఆఁ.... మీ తాత 'సీరు కట్టు' అని కాబోలు పొలాన్నే వుండిపోయారు. వండటానికి ఇంట్లో కూరేం లేదు. రోజూ కూరగాయలో చేపలో అమ్మొచ్చేవి. అవాళవీ రాలేదు. మీ తాత ఆకలి మీదొస్తారు ఏం వండనూ అని ఇదవుతోంటే మీ నాన్న విన్నాడు కామోసు ఎక్కడున్నాడో ఇన్ని తోట కూరకాడలు పట్టుకొచ్చి 'ఇవి వండమ్మా' అన్నాడు. ఎక్కడివిరా అంటే పెద తాతగారి దొడ్లోంచి ఎవరూ చూడకుండా గోడదూకెళ్ళి తెచ్చానన్నాడు గొప్పగా. నాకు వెర్రి కోపం వచ్చేసిందర్రా. కలలో కూడా చెయ్యి జాడించి ఎరగని దాన్ని అవాళ నాలుగు బాదేశాను. ఇంకెప్పుడూ దొంగతనం చెయ్యనన్నా విడిచి పెట్టలేదు వాడి రెక్క పట్టుకుని పెదమావ గారింటికి తీసుకెళ్ళి వాడిచేతే తోటకూర కాడ లిప్పించేశాను. పోనీలే చిన్న పిల్లాడు తెలిసీ తెలీకేదో చేశాడని మా పెద మావగారు సమర్థించినా నేనూరుకోలేదు. ఇలాటి చిన్న చిన్న దొంగ పనులే పెద్దవవుతాయని వాళ్ళ ముందే లెంపలేసుకోమన్నాను...."

"మీ తాతయ్య నిన్నేమీ అన్లేదా బామ్మా"

ఆ ప్రశ్న వేసిన సుభాష్ వంక ముసి ముసిగా నవ్వుతూ చూసి అంది "చచ్చి ఏ స్వర్గానవున్నారో గాని మీ తాతెప్పుడూ నన్నేమీ అనే వారు కాదర్రా"

"మా డాడీని నువ్వు కొట్టినా ఏమీ అన్లేదా?" కొంచెం విస్తుబోతూ అడిగాడు రాజు.

"మీరెరగరుగానీ మీ తాత నిప్పులాంటి మనిషిరా. పరుల సొమ్ము విషంతో సమానమనేవారు. మనది మనకుండాలి. మనది మనం తినాలి గాని ఎవరిదో రావాలి. ఎవరి సొమ్మో తినాలనుకోవడం మహాపాపం అనే వారు. బ్రతికినన్నాళ్లూ ఆ మాట మీదే నిలబడ్డారు మా రాజు. ఒకసారే వయ్యిందో తెలుసా ?"

"ఏమయ్యింది గ్రానీ" గబుక్కునంది ఆరతి.

"అప్పట్లో మీ తాత తాయారమ్మ గారనీ మచ్చిపురి బ్రాహ్మలపొలం పాలుకి చేసేవారు. ఓసారి పంటలు సరిగ్గా పండలేదని కామోను సర్కారోడు కౌలు ధాన్యం ఇవ్వక్కర్లేదన్నాడు. అదే సందని చాలా మంది ఎగ్గొట్టేశారు కూడానూ. కాని మీ తాత పూరుకోలేదు సుమా. వారి కివ్వాల్సిన ధాన్యాన్ని బండి మీదేను కెళ్ళి ఇచ్చొచ్చారు. అప్పట్నుంచీ ఆ బ్రాహ్మలకి మీ తాతంటే ఎంతో గురి. మీ తాత బతికున్నన్నాళ్ళు వారి పొలాన్ని మరొకరికి కౌలుకిస్తానన్న మాటే అన్లేదంటే నమ్మండి"

అలాగా అన్నట్టు తలలూపారు పిల్లలు.

ఆరతి ఆవులించడం చూసి "నిద్రస్తోందా? పడుకోండర్రా" అందా విడ.

"నిద్రరావడం లేదు గ్రానీ. ఇంకా చెప్పు. నువ్వు చెప్పే కబుర్లెంతో బావుంటాయి" అంది ఆరతి.

చిన్నగా నవ్వి అంది "ఏం చెప్పనర్రా. ఆ రోజుల్లో మాటకోసం మంచి కోసం ప్రాణాలివ్వడానికి సిద్ధపడేవారనుకో. ఇప్పుడే మందీ పిదప కాలమూ పిదపబుద్ధులూనూ!"

"మా తాత గురించి చెప్పు బామ్మా" సుభాష్ అన్నాడు బామ్మ చెయ్యి పట్టుకుని కుదుపుతూ.

మనవడి వంక సంబరంగా చూసి అంది "ఆ మారాజు గురించేం చెప్పన్రా. ఆయనకేం ఆయన దారి ఆయన చూసుకున్నారు నన్నొదిలేసి!"

ఆమె కంఠం రుద్ధమయ్యింది. సన్నగా వణికింది కూడా.

"ఊరుకో బామ్మా" గోముగా అన్నాడు.

"ఆయన్ని మీలో చూసుకుంటూ ఏదో బండి లాగించేస్తూ భగవంతుడు నన్నెప్పుడు పిలుస్తాడా అని ఎదురుచూస్తున్నాను...."

"అలా మాట్లాడకు బామ్మా—ప్లీజ్..."

"అలాగేలేరా. అప్పుడే ఎక్కడ పోతాన్రా. మీ పెళ్ళిళ్ళు చూశాకే పోతాను. కొడుకు ఐశ్వర్యము మనవల పెళ్ళిళ్ళూ చూట్టానికి మీ తాతె లాగూ నోచుకోలేకపోయారు. నేనైనా చూస్తాన్లేరా. ఇలాగైనా స్వర్గంలో వున్న మీ తాత సంతోషించనీ ... ఇంక పడుకోండ్రా చాలా పొద్దుపోయింది" ప్రక్కమీది కొరుగుతూ అంది మహాలక్ష్మమ్మ.

గతకాలపు జ్ఞాపకాలు చాలా పేపటి వరకూ ఆవిడ్ని నిద్రపోనివ్వ లేదు.

*　　　*　　　*

"ఏవండీ ఏవండోయ్...."

"ఎవరూ" అంటూ బయటి కొచ్చిన శ్యామల గుమ్మం ముందు నిలబడ్డ పల్లెటూరతన్ని చూసి "ఎందుకూ" అనడిగింది.

"తమరు సుబ్బారాయుడిగారి కోడలు కదండీ"

"అవునూ—ఏం?"

"మాదీ మల్లవరపేనండి. తమరు నన్నెరగరు గానీ అయ్యగార్ని గానీ పెద్దమ్మగార్నిగానీ పిలవండి. రావుడొచ్చాడని చెప్పండి కాస"

లోపలికెళ్ళి అత్తగార్తో చెప్పడం ఆలస్యం "రావుడొచ్చాడా? మన రావుడే?!" అంటూ పొంగిపోతూ పరుగెత్తుకొచ్చింది మహాలక్ష్మమ్మ.

"ఒరే రావుడూ! బాగున్నావుట్రా. పరాయివాళ్ళ అక్కడే నిల బడి పోయావేంరా లోపలికిరా. నీ పెళ్ళాం పిల్లలూ అంతా బావున్నా రుట్రా"

"ఏం బాగులెండి ఏదో ఇలా గున్నాం. మా గోలకేంగానండి తమరి కికక్కడంతా బావుందాండి. శానా మారిపోయారు!"

"బాగానే వుందిరా. కళ్ళల్లో పెట్టుకునే కొడుకూ కాలుకదపనివ్వని కోడలూ ప్రేమగా చూసుకునే మనవళ్ళు-నాకేం లోటు చెప్పు? ఇప్పుడే వస్తాను కూర్చోరా"

లోపలికెళ్ళి పెద్దగ్లాసుతో మజ్జిగ తెచ్చిచ్చింది.

ఎందుకంటూనే పుచ్చుకుని త్రాగేశాడు.

"ఈ పూరెప్పుడొచ్చావురా?"

"నాల్రోజులైందండి. మా ఇంటి దానికి కేన్సరంటండి. ఆదొత్తేసూ తీసుకొచ్చానండి"

"లచ్చికి కేన్సరొచ్చిందా? ఇప్పుడెలా వుందిరా?" ఆందోళనగా అడిగింది.

"ఏదోవుందండి. రోజూ కరెంటు పెడతన్నారండి. పది ఇరవై రోజులన్నా వుండాలంటన్నారండి"

"వుండాల్సొస్తే వుండంట్రా పూర్తిగా నయమయ్యాకనే వెళ్ళండి"

"అయ్. ఈ ఇల్లు అబ్బాయిగారిదేనాండీ"

"అవున్రా. నిరుడే కట్టాడు. లోపల చూద్దువుగాని రా"

"ఎందుకులెండి...."

"రా రా"

"శ్యామలా! వీడు రావుడని మీ మావగారు వ్యవసాయం చేసే రోజుల్లో మన కమతంలో పనిచేసేవాడు. మంచి'పనోడూ నమ్మకస్తుడూనూ. పాపం భార్యకి ఇంట్లో బాగోక పోతేనూ ఇక్కడికి తీసుకొచ్చాట్ట. మా కోడల్ని ఎరుగుదువు కదుట్రా" కోడలికి పరిచయం చేస్తూ అంది మహా లక్ష్మమ్మ.

"ఎప్పుడో పెళ్ళిలో చూసేనండి"

"మళ్ళీ మనూరొస్తే కదా చుట్టానికి! ఈ ఏడాది అమ్మవారి తీర్థానికి అంతా రావాలనుకుంటున్నాం మరి. ఆ పైన చల్లాలమ్మ దయ!"

"రండమ్మగారూ అంతా సంతోసిత్తారు"

"వస్తాం లేరా. ఇవిగో ఈ కుర్చీలూ కూర్చునే పరుపులూ గాలి పంకాలూ అన్నీ అబ్బాయి కొన్నవేరా. ఇలారా- ఈ ఇనుప బీరువాలుకూడా అబ్బాయే కొన్నాడు. ఇది టీవీరా రంగుల్లో బొమ్మలు కన్పిస్తాయిరా. పిని మాల్లోలా మాటా బొమ్మా కూడా కన్పిస్తాయి" అంటూ వంటింట్లోకి తీసు కెళ్ళింది.

"దాన్ని గేస్టవ్వు అంటార్రా. క్షణంలో కుంచెడు బియ్యం వార్చెయ్యొచ్చనుకో. భోషాణం పెట్టెలా వుంది చూడు అందులో బట్ట లేస్తే చాలు పుతికి ఆరబెట్టేస్తుందిరా. చాకలి అవసరమే లేదనుకో. ఇదేమో ఫ్రిజ్జు. నీళ్ళెంత చల్లగా వుంటాయో. వేసాకాలం ప్రాణం లేచొస్తాదనుకో. ఇందులో కూరలూ నారలూ పళ్లూ గిన్నా దాచుకోవచ్చు. వారం రోజు లుంచినా ఏం పాడవ్వవురా...."

"అలాగాండి. అన్నీ సిత్రంగానే వున్నాయండి...."

"ఇలాటివి చాలా వున్నాయిరా. ఇదేంటో తెలుసా ? పిండి రుబ్బే

మిషన్రా. చిటికెలో మెత్తగా రుబ్బేస్తుందనుకో. వేడి నీళ్ళు కాసేది కూడా వుందిరా"

"అబ్బా అబ్బా- ఎన్ని సిత్రాలో !"

"అంతే మరి. పని మనుషులున్నా వాళ్ళు పేరుకి పని మనుషులప్ప వాళ్ళేం శ్రమ పడక్కర్లేదనుకో. అన్ని పనులూ మిషన్లే చేసేస్తాయి. రారా- అలా కూర్చో" అంటూ ఆవిడ హాల్లోని సోఫాలో కూర్చుంది.

రావుడు ఆమె కొంచెం దూరంలో నేల మీద చతికిలబడ్డాడు.

"అబ్బాయీ పిల్లలూ లేనప్పుడొచ్చావు. రేపో ఎల్లుండో మళ్ళీ రారా. నీ పెళ్ళాన్ని కూడా తీసుకురా చూస్తుంది"

"అలాగేనండి. అబ్బాయిగారి ఇల్లు సూత్తా వుంటే కన్నుల పండుగ్గా వుందండి. తమరూ అయ్యగారూ చేసిన దానాలూ పూజలూ పున్నాలూ అబ్బాయి గార్నింత గొప్పోర్ని సేశాయండి"

"నీ అభిమానం గానీ ఇందులో మాదేం వుందిరా. అంతా అబ్బాయి కష్టమూ కోడలి అదృష్టమూనూ"

"అలాగనకండి మరి...."

"సరేలే గాని కాళ్ళు కడుక్కో"

"ఇప్పుడలాటియేం పెట్టమాకండి. ఇంకో సారొత్తాను గదండి"

"మా ఇంటి కొచ్చి చెయ్యి కడుక్కోకుండా వెళ్తావా ? ఎలా వెళ్తావో వెళ్ళరా"

"తమరలా గంటే ఏవన్నండి"

"ఏమీ అనొద్దు గాని కాళ్ళు కడుక్కో"

కడుక్కోక తప్పింది కాదు.

ఊరి విషయాలు కనుక్కుంటూ దగ్గరుండి కొసరి కొసరి వడ్డించింది మహాలక్ష్మమ్మ. తృప్తిగా భోంచేసి త్రేన్చాడు రావుడు.

"కాలం ఇదివరకట్లా లేదండమ్మగారూ. రెక్కలు ముక్కలు చేసుకుని పండించటమే గానండి గింజలకి రేటుండటం లేదండి. కొనాల్సిన ఎరువుల ధరలు మాత్రం అంతూ పొంతూ లేకుండా పెరిగి పోతన్నా యండి. ఇంక సిన్న పనైనా సిటికె పనైనా అంతా సొమ్ముల్తోనే వుందండి. సొమ్ము లివ్వకపోతే కాలవ నిండా నీళ్ళున్నా కాలవ పక్క చేలోకి నీళ్ళు రావండి. ఈ ఏడు లేని దాళ్వా తెచ్చుకోడానికి గవర్న మెంటోడికి కట్టింది గాక ఎకరాకి నలభై రూపాయల చొప్పున మామూళ్లి చ్చామండి"

"మీ వుసురూ మీ వుసురూ పోసుకుని వాళ్లేం బాగుపడతార్లేరా. ఎప్పుడో అంత కంతా అనుభవించక పోరు!"

"మరి నే నెల్లొత్తానండి. ఒచ్చెళ్ళానని అబ్బాయిగార్తో సెప్పండి"

"చెబుతానుగానీ రేపో ఎల్లుండో ఏ సాయంత్రమప్పుడో ప్రొద్దు న్నప్పుడో రాదా. వదో పరకో ఇస్తాడు అబ్బాయి. ఈ మహా పట్నంలో ఎంత డబ్బున్నా చాలదు. ఇక నీలాటి వాళ్ళ సంగతి చెప్పాలా?"

"వత్తా నమ్మగారూ" చెమ్మగిల్లిన కళ్ళతో చేతులు జోడించాడు రావుడు.

ఏదో గుర్తు రాగా "కాసేపుండొరేయ్" అన్చెప్పి లోపలి కెళ్ళి పాత సీసాలో చింతకాయ పచ్చడి పెట్టి తెచ్చిచ్చింది.

"పథ్యానికి మంచిదిరా.... రేపో ఎల్లుండో తప్పకుండా రావే"

"అయ్"

వెళ్తోన్న రావుడి వంక పుత్ర వాత్సల్యంతో చూస్తూండిపోయింది మహా లక్ష్మమ్మ చాలాసేపు.

* * *

"నర్సయ్యా- అప్పుడే కేరేజీ తెచ్చేశావేంటి. అయ్యగారు భోం చెయ్యలేదా ?" అర్థ గంట క్రితం తను పంపిన కేరేజీతో తిరిగొచ్చిన ప్యూన్ని అడిగింది శ్యామల.

"తిన్లేదండి"

"ఏం రా- ఏమైనా పార్టీ వుందా ?"

"అబ్బే...." బుర్ర గోక్కుని ఇబ్బందిగా చూశాడు.

"మరెందుకు తిన్లేదురా ? ఫోన్ చేస్తానుండు"

"అయ్యగారు ఆఫీసులో లేరండి"

"ఎక్కడి కెళ్ళేరు ?

"పోలీసుల కూడా వెళ్ళారండి"

"ఎక్కడికిరా"

"స్టేషన్కండి. మరండీ అయ్యగారు లంచం తీసుకుంటోంటే పట్టుకుని తీసుకెళ్ళారండి...."

"ఏవిట్రా- నువ్వు చెప్పేది నిజమేనా ?" కాళ్ళ క్రింది భూమి కంపిస్తోంటే అడిగింది.

"అవునండి- అయ్యగారి రాబడిని చూసి కుళ్ళిపోతున్న ఆఫీసు వాళ్ళే పట్టిచ్చారంటున్నారండి"

"వాళ్ళకేం పోయేకాలం వచ్చిందిరా. దొరికిన కాడికి వాళ్ళు మాత్రం మింగటం లేదూ· వాళ్ళేదో మడిగట్టు కూర్చున్నట్టు వెన్నుపోటు పొడుస్తారా ? వాళ్ళ పీనుగులు కాటికెళ్ళ ! ఇప్పుడెలారా నాకు వణకూ దడా వస్తోందీ...."

"అయ్యగారు ప్లీడరు గార్ని పిలిచి వారితో కలిసెళ్ళారండి. ఇంకొంచెం సేపట్లో వచ్చేస్తారండి"

"అలాగా. సరి నర్లే- ఎవర్తోనూ అనకే" అని చెప్పి, "ఏలావోలా

ఈ గండం గడిస్తే ఇక జాగ్రత్తగా వుంటాలి...." అనుకుంటూ కళ్ళు తుడుచుకుంటూ పూజ గదిలో కెళ్ళింది శ్యామల దేవుడ్ని ప్రార్థించ డానికి.

కొంచెంగా వారి సంభాషణ విన్న మహాలక్ష్మమ్మ కంతా అయోమయంగా అన్పించింది. కోడలెందుకలా ఆందోళన పడుతోందో బొత్తిగా అర్థం కాలేదు. ఆమె తల్లి మనస్సేదో కీడుని శంకిస్తోంటే వెళ్తోన్న ప్యూన్‌ని పిలిచి "ఏం జరిగిందిరా" అనడిగింది మెల్లగా.

ఏం లేదని తప్పించుకో జూశాడు గానీ ఆమె వదలక పోయేసరికి అతడికి చెప్పక తప్పలేదు.

సాంతం వినకుండానే తాడెత్తున లేచిందావిడ.

"మా అబ్బాయి లంచం తీసుకున్నాడా ? ఎవడ్రా అలా కూసింది' వాడి నోట్లో పురుగులు పడ! ఒరే మాది నిప్పులాంటి వంశంరా. ఇతరుల సొమ్ము కాళపడి నానా గడ్డీ మేయడం మా వంశంలోనే లేదురా ఏమిటను కున్నావో. ఒకళ్ళకి పెట్టడమే గాని ఒకళ్ళ దగ్గర పుచ్చుకోని చేతులురా మావి. మాకు మట్టిలో బంగారం పండించటం తెలుసుగాని ఒకళ్ళ వుసురు పోసుకుని ఇల్లు నింపుకోడం తెలీదురా. ఒళ్ళు దగ్గర పెట్టుకుని మసలుకో లేకపోతే అబ్బాయితో చెప్పి నీ వుద్యోగం పీకేయిస్తాను"

ఆ మాటలకి అతడి క్రోధం వచ్చింది. ఆఫీసర్ల గుట్టు మట్లు జీర్ణించుకున్న తనని ఓ ముసిల్ది గడ్డి వరకలా తీసి పారేస్తుందా అను కున్నాడు.

"ముందు మీ అబ్బాయిగారి వుద్యోగం వూడిపోకుండా చూసు కోండి. మీ అబ్బాయేదో పత్తిత్తు అనుకుంటున్నారు కామోసు. మా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్లో ఆయనంత పెద్ద లంచగొండే లేడండి. అన్నిట్లోనూ పెద్ద వాటా ఆయన్దే. మీకు తెలీకపోతే తెలుసుకోండి గాని అనవ

నరంగా నోరు పారేసుకోవద్దు. దాక్వా లేని పొలాల్లో దాక్వా పండించుకో నిస్తున్నందుకు గాను రైతుల దగ్గర్నుంచి మామూళ్ళూ చేసి అయ్య గారికి పెద్ద వాటా ఇస్తోంటేనే పట్టుకున్నారివాళ !"

ప్రాన్పడిపోయింది మహా లక్ష్మమ్మ.

రైతు కడుపున పుట్టిన తన బిడ్డ రైతుల కడుపు కొట్టి తన ఇల్లు నింపుకుంటున్నాడా ? ఇంత కంటే దారుణం వుంటుందా ఎక్కడైనా ?! పరుల సొమ్ము పాముతో సమానమని చూసే వంశంలో పుట్టిన అబ్బాయి లంచాలు తీసుకుంటున్నాడా ? తులసి వనంలో గంజాయి మొక్క మొలిచిందా ?

బాణం దెబ్బ తిన్న పక్షి పిల్లలా విలవిల్లాడిందామె. కళ్ళ నుండి కన్నీళ్ళు జలజలా రాలిపోతోంటే నిస్త్రాణగా కూలబడిపోయింది.

అయినా నర్సయ్య వూరుకోలేదు. "ముసలమ్మగారూ! మీకు తెలుసో లేదో గాని ఈ ఇల్లు లంచాలతో కట్టిందే. ఇంట్లోని సరుకుల్లో చాలా వరకూ లంచాలుగా వచ్చినవే. బ్యాంకులోని డబ్బూ మీ ఒంటిమీది నగలూ మీరు తింటోన్న తిండీ-అన్నీ అంతా లంచ మేనండి. ఈ సంగతులు మీకు తెలవ్వేమో గాని వూరందరికీ తెలుసండి" వుక్రోషంగా అనేసి విసురుగా వెళ్ళిపోయాడు.

అవాక్కైపోయిందావిడ.

వూహించని వచ్చి నిజాలు చెవిన బడే సరికామె మనస్సు మొద్దు బారి నశ్లైపోయిందొక్కసారే.

గుండెల్లోంచి గుబులు గుబులుగా దుఃఖం పొంగి వస్తోంటే పిచ్చి దాన్లా వీధిలోకి చూస్తూండి పోయింది. ఏ మూలో పిసరంత ఆశ ఆశపెడు తోందింకా.

కొంచెం సేపటికి జీపు వచ్చి ఆగింది ఇంటి ముందు. అందులోంచి విశ్వనాథం దిగాడు. అతడి మొహం నల్లగా వుంది. రక్తహీనంగావుంది,

విషాద మూర్తిలా కూర్చున్న తల్లిని చూసి వులిక్కిపడ్డాడు. అప్పుడెప్పుడో చిన్నప్పుడు తోటకూర కాడలు దొంగిలించినప్పుడు తల్లి చేసిన రాద్ధాంతం గుర్తొచ్చింది. తలొంచుకుని లోపలి కెళ్ళిపోయాడు. అతన్లో పశ్చాత్తాపం రగిలింది- కొన్ని క్షణాలే అయినా!

కొడుకువాలకాన్ని బట్టి తను విన్నదంతా నిజమే అన్పించింది మహాలక్ష్మమ్మకి. కాని కొడుకింతిలా దిగజారతాడంటే ఇంకా పూర్తిగా నమ్మకం చిక్కటం లేదు. మెల్లగా లేచి గది దగ్గరికెళ్ళింది.

"అబ్బాయ్! నే విన్నది నిజమేనుట్రా" ఆమె గొంతు కంపిస్తోంటే కళ్ళు కన్నీళ్ళతో నిండిపోతోంటే అడిగింది.

ఎవరూ మాట్లాడలేదు.

మళ్ళీ అడిగింది.

"ఈ గొడవ నుంచి బయటపట్టం ఎలారా దేవుడా అని మేం ఇదవుతోంటే మధ్యన మీ గోలేమిటి? వెళ్ళి మీ పని చూసుకోండి. ముసలాళ్ళు కృష్ణా రామా అనుకుంటూ ఓ మూలన కూర్చోవాలి. అన్నిటికీ తగుదునమ్మా అని తయారయితే ఎలాగా?!"

కోడలు కసిరి నందుకు బాధగా అన్పించలేదుగాని తను విన్న మాటల్ని వాళ్ళు ఖండించనందుకు తల్లడిల్లిపోయింది.

"వాడు కూసిందంతా నిజమే నన్నమాట...." గొణుక్కుంటూ కళ్ళుతుడుచుకుంటూ పెరటిపై పెళ్ళింది.

పని మనిషి గోడ దగ్గర నిలబడి ప్రక్కింటావిడతో ఏదో చెప్పి నవ్వుతోంది.

మహాలక్ష్మమ్మ ప్రాణం ఛివ్వుమంది.

అయితే వార్తప్పుడే చెవులు మారుతోందన్నమాట. రేపటికి వూరందరికీ తెలిసిపోతుంది ఎల్లుండు తన వూరివాళ్ళకీ తెలిసిపోతుంది!

అంతా ఫలానా మహాలక్ష్మమ్మ కొడుకు అవినీతి పరుడంటూ పగలబడి నవ్వుతారు. ఫలానా సుబ్బారాయుడి కడుపున చెడబుట్టాడని నిందిస్తారు అవి తను వినగలదా? విని భరించగలదా? భగవంతుడా! ఈ వయస్సులో ఎలాటి కష్టం తెచ్చి పెట్టావయ్యా!

ఆందోళనతో ఆవేదనతో రగిలిపోతూ దిక్కుతోచక పూపిరాడక కాలు కాలిన పిల్లిలా కలతిరుగుతూంటే "గుడీవినింగ్ బామ్మా" అంటూ కాన్వెంటు నుంచొచ్చారు మనవలూ మనవరాలూ.

ఆమె బదులివ్వలేదు. రోజూలా సరదాగా మాట్లాడలేదు. కాన్వెంటు కబుర్లూ అడగలేదు.

"బామ్మ మూడ్ మారిపోయిందేవిటి" అనుకుంటూ బోర్నవిటా త్రాగి క్రికెట్ బ్యాట్లు పట్టుకుని ఆటలకెళ్ళిపోయారు పిల్లలు.

పిచ్చిదాన్లా అటూ ఇటూ తిరుగుతూ వంటింట్లో కెళ్ళింది మహాలక్ష్మమ్మ.

గ్యాస్‌స్టవ్. మిక్సీ, వాషింగ్ మెషీన్, ఫ్రిజ్.... తనని చూసి హేళనగా నవ్వుతున్నట్టనిపించి హాల్లో కొచ్చేసింది.

కుర్చీలూ సోఫాలూ టీవీ ఇంటిగోడలూ కప్పూ అన్నీ పగలబడి నవ్వుతున్నట్టుగా అనిపించింది.

ఇవన్నీ కొందరి నోళ్ళు కొట్టి వాళ్ళ పుసుపుసోసుకుని కొన్నవే అన్పించే సరికామె కెంతో కంపరంగా అన్పించింది. ఒళ్ళంతా తేళ్ళు జెర్రూ ప్రాకుతున్నట్టనిపించి నేల మీద కూలబడి అరచేతుల్లో మొఖం దాచుకుని బావురుమంది.

లోపల గదిలో విశ్వనాధమూ శ్యామలా జరిగిన వ్యవహారాన్నంతా సమీక్షించుకున్నారు. జరగాల్సినదాని గురించి రకరకాలుగా ఆలోచించారు.

చేతికి పట్టి అంటకుండా బయటపడే మార్గాలని అన్వేషించారు. ఫోను ద్వారా ఎవరెవర్నో సంప్రదించారు ఏవేవో ముగ్గులు పెట్టారు.

ఆ హడావిడ్నుంచి తలెత్తి చూసిన విశ్వనాధమూ అతడి భార్య గుమ్మంలో నిలబడి వున్న మహాలక్ష్మమ్మనీ ఆమె చేతిలో వున్న పాత ట్రంకు పెట్టెనీ చూసి చిత్తరువులయ్యారు.

"నేను వెళ్తున్నాన్రా"

"ఎక్కడికమ్మా" బాధగా అడిగాడు విశ్వనాథం తల్లి కళ్ళల్లోకి సూటిగా చూడలేక తల దించుకుంటూ.

"మన వూరికిరా. ఇక్కడుండి పరమాన్నాలు తినేకన్నా మనూళ్ళో కలోగంజో తాగితే ప్రాణానికెంతో తృప్తిగా శాంతిగా వుంటుందిరా"

"ఇప్పుడేం జరక్కూడనిది జరిగిందనీ ఆ పల్లెటూరు పోతానంటున్నారు?" నిరసనగా చూస్తూ విసురుగా అంది కోడలు.

"ఏమీ జరగనట్టే మీ కన్పించొచ్చు. కాని నాకిక్కడ వూపిరాడ్డం లేదు. నీ ఇల్లూ నీ వస్తువులూ నన్ను చూసి నవ్వుతున్నాయిరా. ఇన్నాళ్ళు కళ్ళు మూసుకునిక్కడ పడుండి పాపిష్టి కూడు తిన్నందుకు నా ఒళ్ళు దహించుకుపోతోందిరా. ఒరే అబ్బాయ్! ప్రేగు తెంచుకుని నువ్వు భూమ్మీద పడ్డప్పుడు కూడా నేనింత నరకం అనుభవించలేదురా. కాని ఇలాటివాడికి జన్మనిచ్చానే ఇలాటి వాడికి పాలిచ్చి పెంచానే ఇలాటివాడ్ని కని భూభారం పెంచానే అని ఇవాళ కుళ్ళిపోతున్నాను. క్రుంగిపోతున్నాను. సిగ్గుతో చితికి పోతున్నాన్రా...."

ఆమె కళ్ళనుండి కన్నీళ్లు జల జలారాలాయ్.

విశ్వనాథం శిరస్సు మరింత క్రుంగిపోయింది.

శ్యామల మాత్రం వూరుకోలేదు. "మీ రెక్కడో పాతకాలపు మనిషి గనుక మీకలా అన్పిస్తోంది గానీ ఈ రోజుల్లో ఇదంతా మామూలే.

పెద్ద పెద్ద వాళ్ళ నుంచి చిన్నచిన్న వాళ్ళదాకా అంతా చేస్తున్న పనే ఇది. ఇందులో చిత్రమూ లేదు తల కొట్టుకొని రాద్ధాంతం చెయ్యాల్సిన అవసరమూ లేదు"

"నిజమేకావచ్చమ్మా. అందుకు వాళ్ళ వాళ్ళ తల్లులూ, తండ్రులూ పొంగిపోతున్నారో కృంగిపోతున్నారో నాకు తెలీదుగాని నేను మాత్రం దుఃఖంతో బాధతో కుళ్లి తిరుగుతున్నానమ్మా. అవున్నేను పాతకాలపు మనిషినే. ఈ మాయలూ మోసాలూ తెలీనిదాన్నే. కానొక్క సంగతిరా అబ్బాయ్. ఏ తల్లి అయినా ఏ తండ్రి అయినా తమ బిడ్డలు స్వశక్తితో స్వయంకృషితో పైకొస్తే ఎంతో సంతోషిస్తారు. వాళ్ల నలుగురికి సాయపడితే మరింత ఆనందిస్తారు. వాళ్ళని పదిమందీ పొగిడితే పొంగిపోతారు. కానీ-అంతా తిట్టుకొంటుంటే లంచగొండి అని నవ్వుతోంటే ఆ నరకం భరించలేర్రా. అంతకంటే కడుపుకోతే మేలురా. వస్తాన్రా. నా అంత అయిన నీకు చెప్పదగ్గదాన్ని కాదుగాని చిన్నప్పటి తోటమాలకాడల సంగతోసారి గుర్తుచేసుకుని లెంపలేసుకోరా. అప్పుడు నిన్ను చూసి నేనూ స్వర్గాన వున్న మీ నాన్నా సంతోషిస్తాం. దీవిస్తాం రా. లేదంటావూ ఇదో పిచ్చిదనుకుని మర్చిపోరా- వస్తాన్రా...."

పైట చెంగుతో కళ్ళు ఒత్తుకుంటూ ట్రంకుపెట్టెపట్టుకుని మెల్లగా నడి చెళ్ళిపోతున్న మహాలక్ష్మమ్మ వంక గుడ్లప్పగించి చూస్తూండిపోయారామె కొడుకూ కోడలూ.

(ఆంధ్రభూమి వారపత్రిక 29-5-86)